ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3, కనిష్ఠం 25.7







● జిల్లాలో పట్టుబడిన నకిలీ విత్తన ప్యాకెట్లు(ఫైల్)



భయపెడుతున్న.. నకిలీ విత్తనాలు

- జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లోకి నకిలీ పత్తి విత్తనాలు
- క్షేత్రస్థాయిలో కనిపించని టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- బీటీ-3 పత్తి విత్తనాల సాగువైపే మొగ్గుచూపుతున్న రైతులు
- రహస్యంగా అధిక ధరలకు అంటగడుతున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు
- జిల్లావ్యాప్తంగా 4 లక్షల 40 వేల ఎకరాలు వరకు పత్తి పంట సాగయ్యే అవకాశం

ఆదిలాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్ సమీపించడంతో మార్కెట్లో నకిలీ పత్తి విత్తనాల జోరు కనిపిస్తోంది. నకిలీ విత్తనాలను రహస్యంగా రైతులకు అంటగట్టేందుకు పలువురు వ్యాపారులు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఏది నకిలో? ఏది అసలో? తెలియక అన్న దాతలను నకిలీ విత్తనాలు భయపెడుతున్నాయి. జిల్లాలో అధికంగా సాగయ్యే పత్తి విత్తనాలకు భారీ డిమాండ్ ఉంటుంది. దీనిని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు నకిలీ విత్తనాలను విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఈ యేడు కూడా బీటీ-3 విత్తనాల కోసం రైతులు ఎగబడుతున్నారు. ప్రతిసారి ఖరీఫ్ సీజన్‌కు ముందు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకోవడం పరిపాటిగానే మారింది. జిల్లా సాధారణ సాగు విస్తీరణం 5 లక్షల 72 వేల ఎకరాలు కాగా.. సుమారుగా 4 లక్షల 40 వేల ఎకరాల వరకు పత్తి పంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులను పూర్తి చేసిన రైతులు ముందు జాగ్రత్తగా విత్తనాలు, ఎరువులను కొనుగోళ్లు చేస్తున్నారు. జిల్లాలో తొలకరి వర్షాలకే మే 25 నుంచి పంటల సాగుకు శ్రీకారం చుడుతారు. మొదట సోయా, పత్తి పంటలను సాగు చేసే అవకాశం ఉంటుంది. గతేడు కొన్ని రకాల పత్తి విత్తనాల కోసం రైతులు ఆందోళనలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం ఈసారి పత్తి విత్తనాల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. కానీ కొందరు వ్యాపారులు అత్యాశతో కృత్రిమ కొరతను సృష్టించే అవకాశం కనిపిస్తుంది. అలాగే పత్తికి మద్ధతు ధర అధికంగానే ఉండడంతో ఈసారి పంట విస్తీరణం అధికమయ్యే అవకాశం ఉందంటున్నారు. కానీ రైతులు మాత్రం బీటీ-3 విత్తనాలను సాగు చేసేందుకే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. లూజు విత్తనాల పేరిట నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు అప్రమత్తమైతే నకిలీ పత్తి విత్తనాలకు కొంత వరకైనా అడ్డుకట్ట పడే అవకాశం ఉందంటున్నారు.

కట్టడి చర్యలేవీ!?

ప్రతియేటా జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడుతున్న ఈ అక్రమ దందాకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంకాగానే అధికారులు హడావుడి చేయడం.. ఆ తర్వాత పట్టించుకోక పోవడంతో నకిలీ విత్తనాల సరఫరాకు అడ్డుకట్ట పడడం లేదంటున్నారు. నిరంతరంగా వ్యాపారులపై దృష్టి సారించాల్సి ఉన్నా.. అవేమీ పట్టించుకోవడం లేదు. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలోకి టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందాలు వెల్లక పోవడంతో విచ్చల విడిగా నకిలీ విత్తన దందా సాగుతున్నట్లు తెలుస్తుంది. గత రెండు రోజులుగా గ్రామస్థాయిలో నకిలీ పత్తి విత్తనాలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కానీ నకిలీ ఏదో అసలు ఏదో రైతులు గుర్తుపట్టే అవకాశం లేదు. దీంతో మళ్లీ నకిలీ విత్తనాలు రైతుల ఇళ్లలోకి చేరే అవకాశం కనిపిస్తుంది. అధికారులే ఫర్టిలైజర్ విత్తన దుకాణాలతో పాటు నకిలీ వ్యాపారులపై ప్రత్యేకదృష్టిని సారించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వేసవి ప్రారంభమైనప్పటి నుంచి నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకుంటు వ్యాపారులు రహస్యంగా అమ్మేసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే గ్రామాల్లోకి నకిలీ విత్తనాలను తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. అధికారులకు ముందుచూపు లేక పోవడంతో ప్రతియేటా నకిలీ విత్తనాలతో అన్న దాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా వ్యవసాయశాఖ అధికారుల తీరు ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలి


: శివకుమార్, ఏడీఏ, ఆదిలాబాద్



రైతులు పత్తి విత్తనాల కొనుగోలు సమయంలో పలు రకాల జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనుభవం ఉన్న విత్తనాలనే కొనుగోలు చేయడంతో పాటు తప్పనిసరిగా విత్తన కొనుగోలుకు సంబంధించిన రశీదును తీసుకోవాలి. అంతేగాకుండా.. ఏదైనా అనుమానం వస్తే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారికి సమాచారం ఇవ్వాలి. నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గ్రామాల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం. పోలీసు శాఖతో కలిసి విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తాం.

నిషేధించినా.. తగ్గని మోజు

నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలను ప్రభుత్వం నిషేధించినా.. రైతులకు మాత్రం వాటి పైననే ఎక్కువగా మోజు కనిపిస్తుంది. ఎందుకంటే కలుపు నివారణ, పెట్టుబడి ఖర్చు లేకుండా పంట దిగుబడులు చేతికి వచ్చే అవకాశం ఉన్న బీటీ-3 వైపే రైతులు ఆసక్తి చూపుతున్నారు. డిమాండ్‌ను బట్టి వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు కొందరు వ్యాపారులు గ్రామాల్లో తమ ప్రతినిధులు, దళారులను నియమించుకుంటు న్నారు. వారి ద్వారానే నిషేధిత నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. 750 గ్రాముల బీటీ-3 పత్తి విత్తన



(తరువాయి 6వ పేజీలో...)



స్ర్కాప్ దుకాణాలపై ఆకస్మిక దాడులు

● దొంగిలించిన వస్తువులను స్ర్కాప్ దుకాణాల్లో కొనవద్దు : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలనే ఉద్దేశంతో ఏకకాలంలో 35 బృందాలతో 10 మండలాల్లో స్ర్కాప్ దుకాణాలపై మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ దొంగతనం అయిన వస్తువులను స్ర్కాప్ దుకా ణాలు ఎలాంటి పరిస్థితుల్లో కొనవద్దని, చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆదిలాబాద్ వన్ టౌన్, టూటౌన్, మావల, బేల, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, నార్నూర్, బోథ్‌లో స్ర్కాప్ దుకాణాలలో జిల్లా పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహించడం జరిగింద న్నారు. 13 స్ర్కాప్ దుకాణాల వద్ద పలు వస్తువులు లభ్యమై నట్లు తెలిపారు. లభ్యమైన షాపుల పై ఆయా పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు, దొంగలించబడ్డ సరుకును, వస్తువులను వాహనాలను, రాగి లోహాలను కొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఉద్యోగ విరమణ పొందిన సైనికులను సన్మానిస్తూ..

వీరుడా.. నీ త్యాగాన్ని వృథా కానివ్వం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ● ఉట్నూర్‌లో వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మురళీనాయక్ సంతాప సభ

ఉట్నూర్, మే 10(ఆంధ్రజ్యోతి): యుద్ధం ఎప్పుడు వచ్చిన దాన్ని ఢీకొట్టడానికి దేశ రక్షణ కోసం ప్రతీ ఒక్కరు సిద్ధంగా ఉండాలని, ముఖ్యంగా యువత ముందు వరుసలో ఉండాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పిలుపునిచ్చారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలో వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రమూఖలతో విరోచితంగా పోరాడి అమరుడైన వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ యుద్ధమే వస్తే నేను సైతం తుపాకీ పట్టి రణరంగంలో ఉండి పోరాడుతానని స్పష్టం చేశారు. అదేవిధంగా దేశం కోసం అమరుడైన జవాన్ మురళీనాయక్ త్యాగం వృథా పోదని ఆయన ఈ సందరంగా పేర్కొన్నారు. మురళీ నాయక్‌ను ప్రతీఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని దేశ రక్షణ కోసం పాటు పడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యావత్‌దేశం, తెలంగాణ రాష్ట్రం భారత సైనిక దళాలకు పూర్తిగా అండగా ఉంటుందన్నారు. మురళీ నాయక్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

● మాజీ సైనికులకు సన్మానం

ఈ సందర్భంగా భారతదేశానికి సేవలు అందించి ఇటీవల ఉద్యోగ్య విరమణ పొంది వచ్చిన పలువురు మాజీ సైనికులు డాకురే శత్రుఘన్, నరోటే వినాయక్‌లను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గండికోట మొగిలి, ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్, వెడ్మ ఫౌండేషన్ సభ్యులు జాదవ్ కృష్ణ, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ వసంత్ నాయక్, మడవి లక్ష్మణ్, మాజీ సర్పంచ్ మర్సిపోలే తిరుపతి, ప్రజాప్రతినిధులు, యువతి, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



నిపాని సబ్ స్టేషన్‌లో గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఏఈఈ తిరుపతి రెడ్డి

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

భీంపూర్, మే 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు, రైతులు విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని ఏఈఈ తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని నిపాని సబ్ స్టేషన్‌లో శనివారం విద్యుత్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ విద్యుత్ సరఫర్‌లో అంతరాయం ఏర్పడితే సబ్ స్టేషన్‌ల సిబ్బందిని సంప్రదించాలన్నారు. రైతులు విద్యుత్ మోటార్‌లు వాడకంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తులు విద్యుత్ స్తంభాలు ఎక్కి సాంకేతిక పనులు చేయరాదన్నారు. 24గంటలు తాము అందుబాటులో ఉంటామని విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య ఉన్న తెలపాలన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్స్ చుట్టు కంచె ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది షౌకత్ అలీ, మోహన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శాస్త్రవేత్తలతో అవగాహన

ఉట్నూర్, మే 10(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్, దంతంపల్లి గ్రామ రైతు వేదికలో వ్యవసాయ శాఖ సహకారంతో సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ శ్రీధర్‌చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయ కళాశాల ఆదిలాబాద్ నుంచి శాస్త్రవేత్తలు హాజరై రైతులు అధిక దిగుబడులు పొందేందుకు చేపట్టాల్సిన నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులను వివరిస్తారని పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జొన్న పంట తూకం కోసం రైతుల కొట్లాట

బోథ్, మే 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్న పంట కొనుగోలు కొనసాగుతున్నాయి. ఓ వైపు ఆకాశంలో మబ్బులు రావడంవల్ల మరో వైపు పంట అధికంగా మార్కెట్‌కు వస్తుండడంతో త్వరిత గతిన తూకం వేయించేందుకు రైతులు ఆరాట పడ్డారు. శనివారం మధ్యాహ్నం తమ జొన్నలు మొదలు అంటే తమ జొన్నలే మొదలువచ్చాయని మార్కెట్లో రైతులు కీచులు ఆడుకున్నారు. అంతేకాకుండా కాంటాను పట్టుకొని రైతులు వాగ్వాదానికి దిగారు. పద్ధతి ప్రకారం తూకం వేయించేవారు లేక పోవడంతో ఈ దుస్థితి నెలకొందని అక్కడున్న రైతులు వాపోయారు. పంటను పండించడం ఒక ఎత్తు అయితే.. అమ్ముకోవడం మరో వ్యక్తి అయిందని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.



తూకం వేసేందుకు లాగుతున్న రైతులు

మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కేసుల నమోదు

● ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి ● మైనర్లకు వాహనాలు ఇచ్చిన పలువురు తండ్రులపై కేసు



ఆదిలాబాద్ అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ పోలీసుస్టేషన్, ఆదిలాబాద్ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరు మైనర్లకు వాహనాలు ఇచ్చిన తండ్రులపై వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు.17 ఏళ్ల మైనర్ యువకునికి బైక్ ఇచ్చిన తండ్రి వేణుగోపాల్‌పై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో 125 బీఎన్ఎస్ సెక్షన్ ప్రకారం క్రైమ్ నెం. 224/25తో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఆదిలాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో నర్సయ్య తన కొడుకు 12 ఏళ్ల వ్యక్తికి వాహనాన్ని ఇచ్చిన పొచ్చెర గ్రామం వద్ద వాహనాన్ని సీజ్ చేసి తండ్రి నర్సయ్యపై 125 బీఎన్ఎస్ సెక్షన్ ప్రకారం క్రైమ్ నెం.138/25తో కేసు నమోదు చేశామని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన, నిబంధన అతిక్రమించి మైనర్లకు వాహనాలను ఇచ్చిన తల్లిదండ్రుల పై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మైనర్లు వాహణాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రమాదాలకు గురి చేస్తున్నారి, ఈ విషయాన్ని గమనించి తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా ఉండాలని సూచించారు.

వర్షంతో మార్కెట్ యార్డ్‌లో అన్నదాతల ఇక్కట్లు

బేల, మే 10(ఆంధ్రజ్యోతి): బేల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు జొన్న పంట దిగుబడులను అమ్మడానికి వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. ఇటీవలే జొన్న పంట విక్రయానికి పెద్దఎత్తున రైతులు మార్కెట్ యార్డ్‌కు పంటను తీసుకు వచ్చారు. అయితే శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షంతో జొన్న పంట వర్షానికి తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



● వర్షానికి తడిసిన జొన్న పంట



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

జవాన్‌లకు మద్దతుగా రేపు భారీ ర్యాలీ

ఆదిలాబాద్ అర్బన్, మే 10(అంధజ్యోతి): భారత ఆర్మీ జవాన్లకు మద్దతుగా ఈ నెల 12న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో ముఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి భారత్ పాకిస్తాన్ యుద్ధ అంశాలపై చర్చించి భారత ఆర్మీ సేవలను కొనియాడారు. ఈ నెల 12న పార్టీ కార్యాలయం నుంచి భారత ఆర్మీ అమరులకు నివాళులర్పిస్తూ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో పార్టీలకు అతీతంగా పాల్గొని జాతీయత భావాన్ని చాటి చెప్పేలా ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ జిల్లాకేంద్రంలోని ప్రధాన వీధుల గుండా చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం కొమురంభీం చౌరస్తా, తెలంగాణ తల్లి చౌక్, వినాయక్ చౌక్ మీదుగా, అశోక్ రోడ్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్‌లో మానవహారం చేపట్టి అమరులకు నివాళులు అర్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో ఇజ్జగిరి నారాయణ, పట్టణ అధ్యక్షుడు అజయ్, యూనిస్ అక్బాని, సాజిదొద్దిన్, మెట్టు ప్రహ్లాద్, లింగారెడ్డి, మారిశెట్టి గోవర్ధన్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో భారీ తిరంగా ర్యాలీ

● పాల్గొన్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్/ ఆదిలాబాద్ రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): భారత సైన్యం, ఆపరేషన్ సిందూరుకు మద్ధతుగా ఆదిలాబాద్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీ గోడంనగేష్, ఎమ్మెల్యే పాయలశంకర్‌తో పాటు విద్యార్థులు పట్టణ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. జాతీయ జెండాలను పట్టుకుని భారత్ మాతాకి జై అంటూ నినాదాలతో హోరెత్తించారు.ఈ ర్యాలీ వినాయకచౌక్ నుంచి ప్రారంభమై పట్టణంలోని ప్రధానవీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ భారత్ దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిని వెంటనే వారి దేశాలకు తిరిగి పంపాలన్నారు.దేశ సరిహద్దులోని గ్రామాల్లో ప్రజల పై పాక్ ఆర్మీ దాడులు చేయడం హేయమైన చర్య అని, పాక్ దాడులకు భారత సన్యం దీటైన జవాబు ఇచ్చిందన్నారు. ఉగ్ర మూకలను శాశ్వతంగా నిర్మూలించాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

పాల్గొన్న పట్టణ ప్రజలు




ఆదిలాబాద్‌లో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు


ర్యాలీలో పాల్గొన్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్


జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్న మహిళలు


పట్టుబడిన నకిలీ విత్తనాలతో పోలీసులు (ఫైల్)

భయపెడుతున్న నకిలీ విత్తనాలు

(5వ పేజీ తరువాయి...)

ప్యాకెట్‌లను డిమాండ్‌ను బట్టి ధర పెంచుతూ అమ్మేస్తున్నారు. ఇప్పటికే కొంత మంది రైతుల వద్దకు బీటీ-3 విత్తనాలు చేరిపోవడంతో విత్తేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

జిల్లాలో డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటూ రహస్యంగా రైతులకు అమ్మేస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి ఎక్కువగా నిషేధిత విత్తనాలతో పాటు నకిలీ విత్తనాలను జిల్లాకు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. గతంలో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలన్ని ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి తరలించినవేనని అధికారుల పరిశీలనలో తేలింది. వ్యాపారులు అదునుచూసి వివిధ మార్గాలలో నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు. తెలివిగా ఎవరికి అనుమానం రాకుండా కొరియర్ సర్వీసులతో పాటు ఆర్టీసీ బస్సుల్లో నకిలీ విత్తనాలను జిల్లాకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. జిల్లా పరిసర ప్రాంతాల్లో భారీగా డంపు చేస్తూ పగలంతా ద్విచక్ర వాహనాలు, ఆటోలలో గ్రామాలకు తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. ప్రతీసారి నకిలీ విత్తనాలు పట్టుబడుతున్న జిల్లా సరిహద్దుల పై సరైన నిఘా సారించడం లేదంటున్నారు.

ట్రాక్టర్ పై నుంచి పడి ఒకరి దుర్మరణం

బోథ్, మే 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని వాగు బ్రిడ్జికి అరకొలో మీటర్ దూరంలో శనివారం మధ్యాహ్నం ట్రాక్టర్‌పై నుంచి పడి పింగడి దత్తు(47) మృతి చెందాడు. మధ్యాహ్నం పూట ట్రాక్టర్లులో జొన్నలు తీసుకుని వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఇరువురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

సోషల్ మీడియాలో వేధింపులు.. వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్ రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళపై సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేయడమే కాకుండా ఆమె పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు. సదరు మహిళ బంధువులు పంజాబ్‌లో నివసిస్తున్నారని, కొన్ని అవసరాల నిమిత్తం అమృత్‌సర్‌కు చెందిన ఒక అసిస్టెంట్ ట్రెజరర్ మునీష్ కుమార్ అనే వ్యక్తిని సంప్రదించగా, అసిస్టెంట్ ట్రెజరర్ నిరాకరించిన కారణంగా అతనిని మహిళ తరఫు బంధువులు పట్టించారని తెలిపారు. ఈ కారణంగా వారిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మునీష్ కుమార్ అనే నిందితుడు మహిళపై ఫేక్ ఫేస్‌బుక్ ఐడీని క్రియేట్ చేసి వేధింపులకు గురి చేశాడని తెలిపారు. ఆదిలాబాద్ సైబర్ క్రైమ్ బృందం సహకారంతో, ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది నిందితున్ని గుర్తించి అమృత్‌సర్ నుంచి ఆదిలాబాద్‌కు తీసుకువచ్చి, ఆదిలాబాద్ 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు మునీష్‌కుమార్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

కనిపించని సూచిక బోర్డు!

సోనాల, మే 10(ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనదారుల రాకపోకలతో రద్దీగా ఉండే అంతరాష్ట్ర రహదారి మూల మలుపులతో ప్రమాదకరంగా మారాయి. సోనాల మండలం సాకెర గ్రామ మూల మలుపు వద్ద సూచిక బోర్డు కనిపించడం లేదు. గత ప్రభుత్వం హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లు రోడ్డు సగభాగం వరకు విస్తరించాయి. దీంతో వాహనదారులకు సూచిక బోర్డులు కనిపించకుండా పోయాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సూచిక బోర్డులు కనిపించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


మలుపు వద్ద కనిపించని సూచిక బోర్డు

ఉట్నూర్‌లో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ


హనుమాన్ మందిరంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఉట్నూర్, మే 10(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ సైన్యం, ఇండియా బార్డర్ పైన ఉన్న భారతదేశ సైన్యంపై కవ్వింపు చర్యలకు పాల్పడి, కాల్పులు జరుపడం, ఆ కాల్పులను విరోచితంగా ఎదుర్కొని బదులిస్తున్న క్రమంలో, భారతదేశ ముద్దుబిడ్డ వీర జవాన్ మురళీనాయక్ అమరుడు కావడం చాలా బాధాకరమని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. శుక్రవారం రాత్రి ఉట్నూర్ పట్టణంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాగా, వీర జవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని ఉట్నూర్ మండల కేంద్రలోని అంబేద్కర్ చౌక్(ఐబీ) నుంచి పార్టీలకతీతంగా వివిధ ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో శాంతి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఐబీ చౌక్ వద్ద వీర జవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ ర్యాలీలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, ఉట్నూర్ మండల మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్, ఉట్నూర్ మాజీ ఎంపీపీ ఆడే ధన్‌లాల్, జాదవ్ రామకిషన్ నాయక్, లింగగౌడ్, వెంకటేష్, కొండేరి రమేష్, పవర్ దేవిదాస్, ప్రజా సంఘాల నాయకులు బానోత్ రామారావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు రాథోడ్ గణేష్, జాదవ్ చంద్రకాంత్, ఆడే గడ్డం ప్రకాష్, బండి విజయ్‌కుమార్, ఆడే విశ్వనాథ్ పీడీ, బానోత్ ఆత్మరామ్, జాదవ్‌రవి, జాదవ్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

● పాకిస్తాన్‌పై విజయం కోసం పూజలు

ఉట్నూర్: పాకిస్తాన్‌పై భారతదేశం విజయం సాధించాలంటూ మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పూజలు నిర్వహించారు. విజయం సాధించేలా భారత సైనికులకు ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. వారిలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రితేష్, ఉట్నూర్ మండల అధ్యక్షుడు బింగి వెంకటేష్, సీనియర్ నాయకులు శ్రీరాంనాయక్, కొండేరి రమేష్, కొమ్ము రామచందర్, సీపతి లింగాగౌడ్, శేషారావు, రాథోడ్, నాగభూషణం, బొద్దు కిరణ్, ఉష్కముల దేవదాస్, పవర్ దేవిదాస్, చింతల రమణ, బానోత్ జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు వెళ్తున్న వారికి నాయకుల సన్మానం

ఆదిలాబాద్ అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదరులను అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణంలోని ఈద్గా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదరులను సత్కరించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హజ్ యాత్రికుల ప్రయాణం సురక్షితంగా సాగాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో నాయకులు జహీర్ రంఆజని, ఎంఏ షకీల్, ముజాహిద్దీన్, మొహమ్మద్ రఫీక్, షేక్ కలీం, అంజద్ ఖాన్, తౌఫిక్, అస్మాత్ ఖాన్, యాత్రికుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై కఠిన వైఖరి అవలంబించాలి : రామన్న

ఆదిలాబాద్ అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): అమెరికా మధ్యవర్తిత్వం వహించి కాల్పుల విరమణ జరిగిన నేపథ్యంలో ఉగ్రవాదంపై కఠిన వైఖరి వహించాలని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన దాడులకు భారత్ దీటైన జవాబు ఇచ్చిందని, భారత సైన్యం యుద్ధభూమిలో తన సత్తా చాటిందన్నారు. సైన్యం పాకిస్తాన్‌కు తనదైన శైలిలో గుణపాఠం చెప్పిందని, ఉగ్రవాదంపై పోరుకు ఇది అంతం కాకూడదని అన్నారు. ఈ సందర్భంగా భారత సైన్యం పోరాటాలను కొనియాడారు. పోరులో అమరులైన వీర జవాన్ల త్యాగం చరిత్రలో నిలిచి పోతుందని అన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలి

సారంగాపూర్, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్పెల్లి గ్రామసమీపంలో తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలని రైతులు పేర్కొంటున్నారు. రైతులు అరుగాలం శ్రమించి పండించిన జొన్నలను విక్రయించాడని రైతులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జొన్నల కొనుగోలుకేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్ధతు ధరను ప్రకటించడంతో చిరు వ్యాపారులు వాహనాలలో మహారాష్ట్ర నుండి సారంగాపూర్‌కు జొన్నలను తరలిస్తున్నారని పేర్కొంటూన్నారు. దీంతో సరిహద్దులో చెక్‌పోస్టు లేక పోవడంతో చిరు వ్యాపారులు వాహనాలలో మహారాష్ట్ర నుంచి తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికయిన సంబంధిత అధికారులు తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలి


కుంటాలలో మాట్లాడుతున్న బీసీ ఆజాది పెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్

కుంటాల, మే 10 : (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లు 42 శాతం అమలు చేయాలని, దేశవ్యాప్తంగా కుల గణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో వెంటనే చేపట్టాలని బీసీ ఆజాది పెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. బీసీ మేల్కొలుపు రథయాత్ర శనివారం కుంటాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రలో బీసీ నేతలు పాల్గొని బీసీలకు జనాభా ప్రతిపాదికన విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో వాటాలను అందించాలని, బీసీ మేల్కొలుపు రథయాత్రలో పేర్కొన్నారు. స్థానిక బస్టాండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దేశ జనాభాలో సగానికి పైగా బీసీ ఉన్నా సరియైన అవగాహన లేక అన్ని రంగాల్లో వెనుకబడి అణగారిన వర్గాలుగా, పేదవారిగా ఉన్నారని, ఈ దేశానికి మూల నివాసులైన మెజార్టీ ప్రజలు బీసీలని స్వతంత్ర భారతదేశంలో మెజార్టీ ప్రజల లక్ష్యాలను పక్కన బెట్టి పెట్టుబడి దారులకు ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీసీ నాయకులు అష్క గజేందర్ యాదవ్, సుంకెట పోశెట్టిలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చాపర్తి కుమార్ గాడ్గే, బీసీ ఆజాది పెడరేషన్ నాయకులు మాచర్ల శ్రీనివాస్, నామని అర్జున్, స్థానిక కుల సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు

నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని కలిసిన వెన్నెలక్క


నిర్మల్ కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాంస్కృతిక రథసారధి వెన్నెలక్క శనివారం నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.


మల్లారెడ్డిని కలిసిన వెన్నెలక్క

భారత సైన్యానికి మరింత బలాన్ని ఇవ్వాలని పూజలు చేయండి

● ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పిలుపు

భైంసా, మే 10 : పాకిస్తాన్ దుష్టశక్తిని తిప్పి కొట్టేందుకు భారత సైన్యానికి మరింత బలాన్ని ఇవ్వాలని కోరుకుంటూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేయాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని చోట్ల కుల మతాలకు అతీతంగా భారతీయులంతా కలిసి దేవాలయాల్లో, మసీదుల్లో, చర్చిల్లో, గురుద్వారాల్లో ఉదయం 9గంటలకు ప్రార్థనలు, ప్రత్యేక పూజలు చేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటై మన ఐక్యతను చాటాలన్నారు. పాకిస్తాన్ దుష్టశక్తులు జనావాసాలపై డ్రోన్లు, మిస్సైల్స్ ప్రయోగించడం సరికాదన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు భారత సైన్యం చేస్తున్న ధైర్య సాహసాలు అమోఘమన్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు గట్టు మైసమ్మ అమ్మవారి సన్నిధిలో భారత జవాన్లకు మరింత శక్తిని ప్రసాదించాలని కోరుకుంటూ పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రాజకీయాలకతీతంగా అందరూ రావాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ఘనంగా మద్ది రామచందర్ వర్ధంతి


రామచందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ ఉద్యమానికి నిస్వార్థంగా సమాజానికి సేవ చేసిన మహానేత ముద్దుబిడ్డ మద్ది రామచందర్ వర్ధంతి నిర్మల్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రామ చందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు రవికుమార్ రామచందర్ జీవిత విశేషాలు ఆనందింపజేశాయని ప్రధాన కార్యదర్శి అనుకొండ సత్యనారాయణ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రామచందర్ ఆదివాసీల హక్కుల కోసం తన జీవితాన్ని అర్పించిన మహాత్ముడని, ఆయన చూపిన మహామార్గంలోనే మనం నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు దాసరి రమేష్, కస్తూరి భీమేశ్వర్, కాల శంకర్, చుంచు పోశెట్టి, అర్జున్, లింగన్న, బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ

ముథోల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఆష్టా గ్రామంలో శనివారం గ్రామస్థులు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన వీరజవాన్ల ఆత్మకు శాంతి కలగాలని, ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని, భారతదేశం యుద్ధంలో గెలవాలని కోరుకుంటూ గ్రామ వీధుల్లో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ యువకులు, గ్రామంలోని విద్యార్థిని విద్యార్థులు ప్రధాన వీధుల గుండా జై భారత్, జైజై భారత్, వీర జవాన్‌లకు మా సెల్యూట్ అంటూ ప్లకార్డులు, జాతీయజెండా చేత బూని ర్యాలీ నిర్వహించారు.


ఆష్టా గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

మురళీనాయక్‌కు నివాళులర్పించిన కడెం నాయకులు

కడెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని దేశ ప్రజలు మరిచిపోలేరని కడెం నాయకులు అన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ ఫ్లెక్సీకి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ రక్షణలో భాగంగా జరిగిన యుద్ధంలో మురళీనాయక్ అమరుడయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హపావత్ రాజేందర్, కిషన్, తారాసింగ్, గంప ప్రసాద్, రాజేష్ నాయక్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన


మాట్లాడుతున్న క్లస్టర్ అధికారి యోగేశ్

తానూర్, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్వి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఆయిల్‌ఫామ్ సాగు చేసిన రైతులకు క్లస్టర్ అధికారి యోగేష్ అవగాహన కల్పించారు. ఆయిల్‌ఫామ్ సాగు చేస్తున్న రైతులకు పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దిగుబడి సాధించడం పట్ల అవగాహన కల్పించారు. పంట టన్ను ధర రూ. 21వేలకు చేరుకుందని కొత్తగా నాటుకునేందుకు రైతులకు అవకాశాలు కల్పిస్తున్నట్లు, ఆసక్తిగల వారు పేర్తను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కృష్ణ, గంగాధర్‌పటేల్, బాలాజీ పాల్గొన్నారు.

భక్తి



శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాకారం


శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం


శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పరిసరాలు


సింహ వాహిణి గుట్ట

భక్తవత్సలుడు.. కాల్వ నరసింహుడు

● భక్తుల కోసం కొండదిగొచ్చిన స్వామి ● 500 ఏళ్ల చరిత్ర గల ఆలయం ● నేటి నుంచి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి మాల వేసిన భక్తులు

దిలావర్‌పూర్, మే10 (ఆంధ్రజ్యోతి): కాల్వఅడవుల్లో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి నమ్మిన వారికి కొంగు బంగారమై భక్తుల నీరాజనాలు అందుకుంటున్నాడు. సుమారు 500 సంవత్సరాల క్రితం స్వామివారు ఇక్కడ స్వయంభుగా వెలసినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. ఆలయం వెనుక వైపు సింహ ఆకారంలో ఉన్న గుట్టపై స్వామివారు స్వయంభుగా వెలిశారని భక్తులు చెప్తుంటారు. ఈ గుట్టను సింహవాహిణిగా పిలుస్తారు. ఈ గుట్టకింద 24 గుహలు, స్వామివారి రహస్య పుష్కరిణి ఉందని చెబుతారు. పౌర్ణమి రోజున గట్టు వైపు నుంచి స్వామివారి భజన గీతాలు, సంకీర్తనలు వినిపిస్తాయని భక్తులు చెబుతుంటారు. భక్తులు గుట్టపైకి ఎక్కి ఇబ్బందులు పడకుండా భక్తవత్సలుడైన భక్తులకు దర్శన భాగ్యం కల్పించేందుకు స్వామియే గుట్టకిందికి దిగివచ్చాడని అందుకే గుట్టకింద స్వామివారికి ఆలయం నిర్మించినట్లు చెబుతారు. ఉగ్ర నరసింహుడై హిరణ్యక శిపుడిని సంహరించిన అనంతరం లక్ష్మీదేవి స్వామివారిని శాంతింపజేసిందని, అందుకే ఇక్కడ వెలసిన ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మి సమేత నరసింహ స్వామి ప్రసన్న వదనంతో భక్తులకు దర్శనమిస్తాడని ప్రతీతి.

సంకట హరిణి.. సింహవాహిణి..

ఆలయానికి వెనుక వైపు ఉన్న సింహవాహిణి గుట్టను దర్శించుకుని గుట్ట చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి మనసారా స్వామిని తలుచుకుని తమ కష్టాలను నివేదిస్తే సకల సంకటాల నుంచి విముక్తి ప్రసాదించి అష్టైశ్వరాలు నొసగుతాడని భక్తులు చెబుతారు. నిజానికి లక్ష్మీ నరసింహ స్వామి సింహ వాహిణి గుట్టపైనే స్వయంభుగా వెలిశారు. ఈ గుట్ట పరీక్షించి చూస్తే సింహకారంలో కనిపించడం విశేషం. అయితే భక్తవత్సలుడైన నరసింహ స్వామివారు భక్తులు అష్టకష్టాలు పడి గుట్టపై రావడం ఇష్టం లేని స్వామివారు ఓ భక్తుడికి కలలో కనిపించి గుట్ట కింద నాకు ఆలయం నిర్మించాలని ఆదేశించారని, తానే గుట్టకిందికి వచ్చి భక్తుల కోరికలు తీరుస్తానని చెప్పాడని అందుకే గుట్ట కింద ఆలయం నిర్మించినట్లు స్వామివారు ఈ ఆలయంలో కొలువై భక్తులకు దర్శనమిస్తూ కోరిన భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్నారు.

భక్తుల కోరికల నివేదిన వేదిక అల్లుబండ

సింహ వాహిణి గుట్టవైపు వెళ్లే దారిలో స్వామివారి అల్లుబండ ఉంది. భక్తులు స్వామివారిని తలుచుకుని మనస్సులో ఉన్న కోరికలను నివేదించి అల్లుపడతారు. ప్రతీ శనివారం వందలాది మంది భక్తులు ఇక్కడ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

పసుపు గంధం.. భూత ప్రేతాలు దూరం

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఉండే పసుపు గంధాన్ని ధరిస్తే భూత ప్రేతాలు బాధల నుంచి విముక్తులు అవుతారని భక్తులు పేర్కొంటున్నారు. పసుపు గంధాన్ని అత్యంత నియమ నిష్టలతో తయారు చేస్తారు. పచ్చి గోలరకం (మండ) పసుపును ఎండబెట్టి చూర్ణం చేస్తారు. దానికి సమానంగా నానబెట్టిన బియ్యాన్ని సైతం చూర్ణం చేసి ఈ రెండింటిని సమపాళ్లలో కలుపుతారు. ఈగంధం తయారీలో కేవలం స్వామివారి మాలను ధరించిన భక్తులు, 60 ఏళ్ల పైబడిన స్త్రీలు మాత్రమే తయారు చేస్తారు. ఈ పసుపు గంధం ఎంతో పవిత్రమైనదిగా భక్తులు భావిస్తారు.

స్వామివారి ప్రసాదం.. ఆయురారోగ్యాలకు అభయం

శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఉండే ప్రసాదానికి ఒక ప్రత్యేకత ఉంది. బెల్లం, శనగ పప్పుతో తయారు చేసిన ఈ ప్రసాదాన్ని ప్రతీ రోజు స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఇస్తారు. ఎంతో భక్తి ప్రపత్తులతో తయారైన ఈ ప్రసాదాన్ని స్వీకరించిన వారు ఆయురారోగ్యంతో పాటు సుఖ సంతోషాలతో ఉంటారని భక్తులు నమ్ముతారు.

పుష్కరిణిలో స్నానం... చర్మ రోగాలు మాయం

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి ఈశాన్య దిక్కులో పుష్కరిణి ఉంది. ఈ పుష్కరిణికి ఓ ప్రత్యేక ఉంది. ఈ పుష్కరిణిలో నీరు రుతువులను బట్టి రంగు మారుతుంది. ఈ పుష్కరిణిలో స్నానమాచరిస్తే చర్మ రోగాలు నయం అవుతాయని స్వామివారి భక్తులు అంటున్నారు.

తపస్సుతో సంతాన ప్రాప్తి

సంతానలేమితో బాధపడే దంపతులు శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో 11రోజుల పాటు తపస్సు ఆచరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సంతానం లేని దంపతులు 11 రోజుల పాటు దేవస్థానంలో నిద్రిస్తూ ప్రత్యేక పూజలు చేయాల్సి ఉంటుంది. (దీనిని ఇక్కడ తపస్సుగా పిలుస్తారు) శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారు 11రోజుల్లో ఏదో ఒకరోజు కలలో కనిపించి సంతాన ప్రాప్తికి అభయమిస్తారని భక్తులు అనుభవ పూర్వకంగా చెబుతున్నారు. అలాగే స్వామివారి పుష్కరిణి పక్కనఉన్న పుట్టలో నాగదేవత కొలువై ఉందని పుట్టలో పాలు పోసి అమ్మవారికి మొక్కుకుంటే సర్వదోషాలు పోతాయని అంటున్నారు.



బ్రహ్మోత్సవాలకు ప్రతీఏటా వస్తాను

● మాదాస్తు శంకర్, మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా

శ్రీకాల్వలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు ప్రతీఏటా వస్తున్నా. స్వామివారి మాలధరించి ఇక్కడే ఉంటాను. కాల్వలక్ష్మీ నరసింహస్వామి చాలా మహిమాన్వితుడు. నియమనిష్టలతో స్వామివారిని వేడుకుంటే కోరికలు నెరవేరుస్తాడు. ఈ విషయాన్ని అనుభవ పూర్వకంగా చెబుతున్నా. అందుకే ప్రతీఏటా బ్రహ్మోత్సవాలలో ఇక్కడే ఉంటూ ప్రత్యేకపూజల్లో పాల్గొంటా. ఈ ఏడాది మా తమ్ముడు కూడా మాల ధరించాడు.



బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం

● అంగూరి మహేందర్, చైర్మన్, కాల్వ దేవస్థానం

నేటి నుంచి ఈనెల 20 వరకు జరిగే శ్రీకాల్వ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లుచేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం. ఏటేటా భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ఈ ఏడాది కూడా సుమారు 50వేల మంది భక్తులు వస్తారని అంచనా వేశాం. అందుకు తగిన ఏర్పాట్లు కూడా చేశాం. బ్రహ్మోత్సవాల్లో ఒక భక్తుడి సహకారంతో ప్రతీ రోజు అన్న ప్రసాద వితరణ చేస్తున్నాం.


శ్రీ ఆది లక్ష్మీ


శ్రీ గోదాదేవి


భైంసాలో ముస్తాబైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి విగ్రహం

జయంతి ఉత్సవాలకు ముస్తాబైన నరసింహ స్వామి ఆలయం

భైంసా: పట్టణంలోని నర్సింహనగర్ కాలనీ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయంలో ఆదివారం జరిగే స్వామివారి జయంతి ఉత్సవాల కోసం ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబైంది. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. వేకువ జాము విగ్రహ అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం ఆలయంలో యాగం, ఇతర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జయంతి వేడుకల సందర్భంగా ఆలయ కమిటి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి భారీ అన్నదాన కార్యక్రమం జరుగనుంది. అన్నదానికి సంబంధించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


నర్సాపూర్‌లో పశువుల తొట్టిలో నీటిని నింపుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

తొట్టిలో నీరు ఏర్పాటు

● మూగ జీవుల దాహార్తితీర్చిన అధికారులు

తలమడుగు, మే 10 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల నర్సాపూర్ గ్రామంలో పశువుల తొట్టిలో నీళ్లలేక మూగజీవాలు అల్లాడుతున్నాయని 'నీళ్లలేక వెలవెలబోతున్న పశువుల తొట్టీలు' అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. డీఎల్‌పీఓ ఫణిందర్ బరంపూర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ అనిల్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. నర్సాపూర్ గ్రామంలో గల పశువుల తొట్టిని శుభ్రపరిచి పక్కన గల మిషన్‌భగీరథ వాటర్ ట్యాంక్ ద్వారా పశువుల తొట్టికు నీరు సరఫరా చేసి పశువుల దాహార్తితీర్చాలని ఆదేశించారు. దీంతో వెంటనే పంచాయతీ సెక్రటరీ గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి పశువుల తొట్టిని శుభ్ర పరిచి పక్కనే ఉన్న మిషన్ భగీరథ వాట ర్ ట్యాంక్ నుంచి పైపులను ఏర్పాటు చేసి పశువుల తొట్టిలోకి నీరు అందించడంతో గ్రామస్థులు రైతులు ఆదివాసీ గిరిజనులు 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాగా పశువుల తొట్టి వద్దకు చిన్నపిల్లలను రాకుండా చూడాలని గ్రామస్థులకు పంచాయతీ సెక్రటరీ అనిల్‌రెడ్డి కోరారు.


పశువుల తొట్టిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఘనంగా హనుమాన్ స్వాముల నగరకీర్తన



భైంసాలో శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ దీక్షా స్వాములు

భైంసా, మే10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లీ హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం స్వాములు శ్రీ హనుమాన్ నగర కీర్తన (శోభాయాత్ర) ఘనంగా నిర్వహించారు. అంజన్న స్వామి ఇష్టదినమైన శనివారం స్థానిక శ్రీ రోకడేశ్వర హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము 4గంటలకు స్వామికి అభిషేకం, అలంకరణ, మహాహారతి



ఇచ్చారు. వందకు పైగా హనుమాన్ స్వాములు ప్రధాన వీధులు గుండా శోభాయాత్ర నిర్వహించారు. దారి పొడవునా స్వాములు జై శ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కాగా.. కాలనీలోని ప్రధాన వీధులు అంజన్న నామస్మరణతో మార్మోగిపోయాయి. భజనలు, కీర్తనలతో స్వాములు నృత్యాలు చేశారు. ఇందులో గురు స్వామి కోర్వ చిన్నన్న, స్వాములు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మూడు తరాల ముచ్చట్లు

మూడు తరాలు కలిసిన వేళ.. ఆనంద హేళ..

దిలావర్‌పూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): వారి ఇంటిపేరు సామ.. ఊరు పేరు గుండంపల్లి. సామ పరివారమంతా ఒక్కచోట చేరి శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ఎక్కడెక్కడో ఉన్న తమ రక్తసంబంధీకులైన ఉన్న ముత్తాత తాతల నుంచి మూడు నెలల చిన్నారుల వరకు పాల్గొన్నారు. ఇలా మొత్తం 150 మంది ఒక్క చోటకు చేరుకుని ఆటలాడారు.. పాటపాడారు.. జోకులు పేల్చుతూ ఆనందంగా గడిపారు. యోగక్షేమాలు తెలుసుకుంటూ ఇకపై ఒకరికి ఒకరం అందరం ఒకటవుదామనికున్నారు. వీరి సమ్మేళనానికి గుండంపల్లి సమీపంలో ఉన్న ఓ రైతు ఫామ్‌హౌస్ వేదికైంది.

సరిచేసే సమయమిదే..!

● గ్రామాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు, తీగలు ● సరి చేయాలని కోరుతున్న ప్రజలు

కుభీర్, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో వంగిన స్తంభాలు, వేలాడే తీగలు ప్రమాదకరంగా మారాయి. వీటికి మరమ్మతులకు వేసవి కాలమే మంచితరుణం. వర్షాలు కురిసిన వెంటనే వ్యవసాయ పనులు ప్రారంభం అవుతాయి. అప్పుడు మరమ్మతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. వీటితో పశువులు, గ్రామస్థులు మృత్యువాత పడే ప్రమాదం ఉంటుంది. ముందే మేల్కొంటే అలాంటి ఘటనలు జరుగకుండా ఉంటాయి. విద్యుత్ అధికారులు వేసవిలోనే పనులు ప్రారంభిస్తే మంచిందని మండల వాసులు కోరుతున్నారు.

● సరఫరాలో అంతరాయం

వేసవిలో ముందగానే పంటచేళ్లలో, రోడ్ల వెంట వంగిన స్తంభాలను సరిచేస్తేవర్షాకాలంలో గృహాలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకం ఉండదు. గాలి దుమారానికి స్తంభాలు కూలిపోవడం, తీగలు తెగడంతో గంటల కొద్ది ఇళ్లకు సరఫరా నిలిచిపోతుంది. రాత్రి సమయంలో మరీ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికైనా మండలం, గ్రామాల్లోని విద్యుత్ అధికారులు వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలను సరి చేయాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారి కదం ఆదిత్యకు వివరణ కోరగా ఇప్పటికే సమస్యాత్మకంగా పలుచోట్ల స్తంభాలు, తీగలను సరిచేయించామని, మిగతాచోట్ల చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు.


మిషన్ భగీరథ పంపు హౌస్ సమీపంలో వంగిన 33/11 విద్యుత్ స్తంభాలు


కుభీర్‌లో పంటచేన్లో వంగిన వ్యవసాయ విద్యుత్ స్తంభం

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.4 : కనిష్ఠం 27.6

నిర్మల్ జిల్లా వార్తలు
8
ఆదివారం 11 మే 2025



స్వచ్ఛంద సంస్థల సహకారంతో అడవుల్లో నీటి కుంటలు

- వన్య ప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యామ్నాయ చర్యలు
- జిల్లాలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్మాణాలు
- సాసర్‌పిట్‌ల ఏర్పాటుపైనా దృష్టి

నిర్మల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అడవుల్లోని వాగులు, కుంటలు పూర్తిగా ఎండిపోవడంతో వన్యప్రాణులు నీటి కోసం సమీప గ్రామాలకు వస్తున్నాయి. అలాగే పచ్చని చెట్లన్నీ ఆకురాలి పోవడంతో ప్రస్తుతం వన్యప్రాణుల ఆశ్రయం కోసం నీడ కూడా కరువవుతోందంటున్నారు. అయితే ప్రతీ ఏటా వేసవికి ముందే సంబంధిత అటవీశాఖ అధికారులు తమ రేంజ్ పరిధిలో వన్యప్రాణుల దాహం తీర్చేందు కోసం అన్నిచోట్ల సాసర్‌పీట్లు, నీటికుంటల నిర్మాణాలు చేపట్టేవారు. సంబంధిత అటవీ సిబ్బంది ఈ సాసర్‌పిట్‌లో నీటిని నిల్వ ఉంచేందుకు చర్యలు తీసుకునే వారు. అవసరమైతే వాటర్‌ట్యాంకుల ద్వారా అడవుల్లోని సాసర్‌పిట్‌లో నీటిని పంపేవారు. అలాగే ప్రత్యేకంగా కుంటలు నిర్మించి అందులో కూడా నీరు నిల్వ ఉండేటట్లు చూసేవారు. ఈసారి మార్చి నెల నుండే ఎండల తీవ్రత పెరిగిపోవడంతో నీటి కుంటలన్నీ ఎండిపోయాయి. అయి తే అటవీశాఖ అధికారులు ముందస్తుగానే అవసరమైన అన్నిచోట్ల సాసర్‌పిట్‌లు, నీటి కుంటల నిర్మాణం కోసం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలపై ఇప్పటి వరకు స్పందించకపోవంతో అధికారులు నిధుల కొరత కారణంగా వీటిని అవసరమైన మేరకు ఏర్పాటు చేయలేకపోయారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో సంబంధిత అటవీశాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టిసారించారు. అయితే సకాలంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో అధికారులు చివరి సమయంలో ఈ ప్రత్యామ్నాయ చర్యలకు శ్రీకారం చుట్టడం వన్యప్రాణులకు శాపంగా మారుతుంది. ప్రస్తుతం వన్యప్రాణుల దాహార్తిని తీర్చడం సంబంధిత అటవీ సిబ్బందికి సవాల్‌గా మారుతుంది.

స్వచ్ఛంద సంస్థల కోసం ఎదురుచూపులు

సాసర్‌పీట్, నీటికుంటల నిర్మాణం కోసం అధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ఇప్పటి వరకు సర్కార్ నుంచి స్పందన కానరాక పోవడంతో వీరు ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే సాసర్‌పిట్, నీటికుంటల నిర్మాణం కోసం స్వచ్ఛంద సంస్థలు, సమీప గ్రామాల ప్రజలతో పాటు అక్కడ యూత్ సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి అటవీశాఖ ఉన్నతాధికారులు సైతం సంబంధిత అటవీరేంజ్ అధికారులను ఈ దిశగా దృష్టి కేంద్రీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే అడవుల సంరక్షణ వన్యప్రాణుల సంరక్షణ కోసం పనిచేస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలను అటవీశాఖ అధికారులు సంప్రదించారు. దీంతో పాటు సామాజిక కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొంటున్న యూత్ క్లబ్‌లను వన్యప్రాణుల దాహార్తిని తీర్చే చర్యల్లో భాగస్వామ్యం చేసేందుకు అటవీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా అడవుల సమీప గ్రామాల ప్రజలకు వన్య ప్రాణుల తాగునీటి విషయంలో అవగాహన కల్పిస్తున్నారు. సమీప గ్రా మాల ప్రజల సహకారం తీసుకొని నీటి కుంటల నిర్మాణాలు చేపట్టాలని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు.

గ్రామ పంచాయతీల సహకారం

అడవుల సమీపంలోని గ్రామ పంచాయతీల్లో ఉన్న ట్రాక్టర్లు నీటి ట్యాంకర్ల సహకారం కూడా తీసుకునేందుకు అటవీశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. దీనికి సంబంధించి పంచాయతీ అధికారులతో సంప్రదింపులు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా సమీప అడవుల్లోకి నీటిని తీసుకు వెళ్లి అక్కడి చిన్న చిన్నకుంటల్లో ఆ నీటిని నిల్వ చేయాలని భావిస్తున్నారు. గతంలో అటవీశాఖ అధికారులు సైతం ప్రైవేట్‌వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అడవుల్లోకి తీసుకెళ్లి సాసర్‌పిట్, నీటికుంటల్లో నిల్వ చేసేవారు. అయితే ఇటీవల అటవీశాఖ రూపొందించిన ప్రతిపాదనలకు సంబంధించి నిధులు మంజూరు కాని కారణంగా అటవీశాఖ అధికారులు గ్రామ పంచాయతీల ట్రాక్టర్లు, ట్యాంకర్ల సహకారం తీసుకునేందుకు సిద్ధమవు తున్నారు. ఆయా మండలాల ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ సెక్రటరీలతో అటవీశాఖ అధికారులు ఈ దిశగా సంప్రదిస్తున్నారు.

వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు చర్యలు

నాగిని భాను, డీఎఫ్ఓ

ఇక్కడి అడవుల్లో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా సాసర్‌పిట్, నీటి కుంటల నిర్మాణాలకు స్వచ్ఛంద సంస్థలు, యూత్ సహకారం తీసుకోబోతున్నాం. అలాగే సమీప గ్రామ ప్రజల సహకారం కూడా తీసుకునేందుకు నిర్ణయించాం. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రణాళిక రూపొందించాం. సంబంధిత అటవీ అధికారులు, సిబ్బంది ఈ దిశగా దృష్టి సారిస్తున్నారు. అందరి భాగస్వామ్యంతోనే వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపడతాం.


వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు నీటిసౌకర్యం ఏర్పాటు చేసిన దృశ్యం


వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు నీటి సౌకర్యాలు ఏర్పాటు చేసిన బృందం

కట్ట హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

లోకేశ్వరం, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భగీరథ చెరువుపై అతి పురాతన ఆలయాల్లో ఒకటైన కట్ట హనుమాన్ ఆలయంలో ప్రతి శనివారం అమ్ములు పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ ఆలయం ఎంతో పవిత్రమైనది. భక్తులు కోరుకున్న కోరికలు తీర్చే ఆలయంగా ప్రసిద్ధి. ప్రతీ శనివారం భక్తులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ జరుగుతుంది. శనివారం శేఖర్ దంపతులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా కట్ట హనుమాన్ ఆలయ అభివృద్ధి కమిటీ రామారావు మాట్లాడుతూ.. ప్రతీ శనివారం కట్ట హనుమాన్ ఆలయంలో కట్ట హనుమాన్ స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తూ భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలియజేశారు. అంతేకాకుండా ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లు నిషేధించామని తెలిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ చేసేవారు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ


పార్టీ సభ్యత్వ కార్డులు అందజేస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను శనివారం పరిశీలకుడు బోయిడి విఠల్ అందజేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని నిర్మల్ నియోజకవర్గ సమావేశం కన్వీనర్ జీ.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. నియోజకవర్గంలోని మండలాలు, నిర్మల్ పట్టణ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భీమ్‌రెడ్డి, రమేష్, ఆత్మారాం, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యులను కలిసిన బాధిత కుటుంబ సభ్యులు


సారంగాపూర్, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల మలక్‌చించోలి గ్రామానికి చెందిన కుర్మే దేవన్న(51) అనే వ్యక్తి గురువారం దుబాయి ఎంబసిలో గుండెపోటు మృతి చెందిన బాధిత కుటుంబం సభ్యులు ఎన్ఆర్ఐ అడ్వైసరీ ఐ కమిటీ మెంబర్ స్వదేశీ పరికి పండ్లను సంప్రదించగా వెంటనే స్పందించి దుబాయ్ ఎంబాసీకి ఇమెయిల్ ద్వారా సమాచారం అందించి మృతదేహం ఇండియాకు తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని ఫోన్ సమాచారం అందించినట్లు బాధిత కుటుంబం సభ్యులు తెలిపారు.

సైనికులకు మాజీ మంత్రి అల్లోల సంఘీభావం


వీర మరణం పొందిన సైనికులకు మౌనం పాటించి సంతాపం తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిర్మల్ అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : దేశరక్షణ కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని రాష్ట్ర మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం వారి నివాసంలో ఆపరేషన్ సింధూర్‌కు మద్దతు తెలుపుతూ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావు లేదని, అందరూ ఏకతాటిపై నిలవాలని పిలుపునిచ్చారు. భారత సైన్యం ధైరయ సాహసాలను, చేసిన త్యాగాలను కొనియాడారు. ఉగ్రవాదంపై పోరాటంలో ప్రభుత్వం తీసుకునే ఏ చర్యకైనా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని నాయకులు ప్రకటించారు. భారత దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించే వారికి సరైన గుణపాఠం చెప్పామన్నారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, భయాందోళనలకు గురికావద్దని వారు కోరారు. అనంతరం యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీర సైనికుడు మురళి నాయక్‌కు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ, ఎఫ్ఏసీఎస్ చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, పాకాల ఫౌండేషన్ చైర్మన్ రామచందర్, నాళం శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్‌ను సద్వినియోగపరుచుకోండి


కుంటాలలో రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీ నరేష్ గౌడ్

కుంటాల, మే, 10 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలం భూ భారతి పైలట్ పథకంలో భాగంగా ఎంపికైనందున గత వారం నుండి ఆయా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తూ రైతుల నుంచి పలు భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిన అధికారులు శని, ఆదివారాల్లో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని డీటీ నరేష్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం పలువురు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్


కుటుంబ సభ్యులకు ల్యాప్‌టాప్ అందిస్తున్న కండక్టర్

నిర్మల్ కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : బస్సులో ల్యాప్‌టాప్ మర్చిపోయిన ప్రయాణికుడి కుటుంబానికి ఆర్టీసీ కండక్టర్ ఉదయ్ అందజేసి నిజాయితీ చాటుకున్నారు. నిర్మల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి సౌదీ వెళ్తున్న ఆర్మూర్‌కు చెందిన శ్రీనివాస్ బస్సులో ల్యాప్‌టాప్ మర్చిపోయాడు. అతని వివరాలు, ఫోన్ నెంబర్ సేకరించిన కండక్టర్.. ఆర్మూర్ స్టేషన్ మేనేజర్‌కు ల్యాప్‌టాప్ అందించారు. నిజాయితీ చాటిన కండక్టర్‌ను డిపో మేనేజర్ పండరి అభినందించారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే.. తల్లిదండ్రులే బాధ్యులు

- ఎస్పీ జానకీ షర్మిల


వాహన తనిఖీలు చేస్తున్న ఏఎస్పీ


పట్టుబడిన మైనర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఏఎస్పీ

నిర్మల్ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులు బాధ్యులుతారని జిల్లా ఎస్పీ జానకీషర్మిల అన్నారు. జిల్లాలో శనివారం రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకీషర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసుస్టేషన్‌ల పరిధిలో మైనర్ డ్రైవింగ్‌లపై తనిఖీలు నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో 70 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసి, 70 వాహనాలు, మైనర్లు వారి తల్లిదండ్రులు కలుపుకొని 107 మందికి ఏఎస్పీ అవినాష్‌కుమార్, ఏఎస్పీ రాజేష్ మీనా స్వయంగా కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు. మోటార్ వాహన చట్టం ప్రకారం వాహన యజమాని బాధ్యత వహించాలి. తల్లిదండ్రులు ఇట్టి విషయం గ్రహించాలని తెలిపారు. ఇట్టి తనిఖీల్లో ఏఎస్పీ భైంసా అవినాష్ కుమార్, ఏఎస్పీ నిర్మల్ రాజేష్ మీనా, అన్ని సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, అన్ని పోలీస్ స్టేషన్ ఎస్సైలు, ప్రొబెషనరీ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా పాల్గొన్నారు. సీఐలు, ఎస్సైలు ఇతర సిబ్బంది హాజరయ్యారు.

నిజాయితీతో విధులు నిర్వర్తించండి

నిర్మల్ కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఎస్పీ జానకి షర్మిల ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బ్లూ కోర్ట్, పెట్రోకార్ సిబ్బందికి ప్రత్యేకంగా పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో సమయపాలన పాటించాలన్నారు. విధులను నిబద్ధతతో నిర్వహించి అధికారుల మన్ననలు పొందాలని స్పష్టం చేశారు. సమస్యలు ఎదురైనప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నిజాయితీతో పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పిటిషనర్ల సమస్యలు జాప్యం చేయకుండా పరిష్కరించాలని, పిటిషన్లు తక్షణమే పంపాలని సూచించారు. ఇన్ఫర్మేషన్ సిస్టం డెవలప్ చేసుకోవాలని, ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు ఉంటాయన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక పనులు చేసేవారిపై శాఖాపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. పెట్రోలింగ్ సమయంలో దొంగతనాలు జరుగకుండా చూడాలని, పాత నేరస్తులపై ఓ కన్ను వేసి ఉంచాలన్నారు. మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

దిలావర్‌పూర్‌లో మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్

దిలావర్‌పూర్, మే 10 (ఆంధ్రజ్యోతి) : మైనర్లకు వాహనాలు ఇస్తే ఏది జరిగినా వాహన యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని దిలావర్‌పూర్ ఎస్సై లోక సందీప్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఆదేశాలతో శనివారం దిలావర్‌పూర్ బస్టాండ్ సమీపంలో మైనర్ డ్రైవింగ్ పైన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ మైనర్లను అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రులను, వాహన యజమానులను పోలీస్‌స్టేషన్ పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల అమాయకుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. లైసెన్స్ లేకుండా రాష్‌గా డ్రైవింగ్ చేస్తే వారి ప్రాణాలతో పాటు ఎదుటి వారి ప్రాణాలు రిస్కులో పెడుతున్నారన్నారు. మైనర్లకు ఇకపై వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఎవరైనా ఇస్తే ఏది జరిగినా ఇచ్చిన వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మైనర్లకు, వారి తల్లిదండ్రులకు, వాహన యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం ఇంటికి పంపించారు.

కల్లూరు - కుంటాల రహదారిపై ..

కుంటాల, మే, 10 : (ఆంధ్రజ్యోతి) : మైనర్‌లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అశోక్ అన్నారు. శనివారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా కల్లూరు - కుంటాల రహదారిపై కుంటాలలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు వాహనాలు నడుపుతుండగా వారి పత్రాలను, లైసెన్సులను పరిశీలించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే ఏదైనా ప్రమాదం జరిగితే వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కావున వారికి వాహనాలు ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ దేవన్న, సిబ్బంది ఉన్నారు.

సమ్మర్ ట్రైనింగ్ క్యాంప్‌లను పరిశీలించిన డీఈవో

దిలావర్‌పూర్, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సమ్మర్ ట్రైనింగ్ క్యాంప్‌ను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి రోజు క్యాంప్‌కు రావాలని సూచించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు స్నాక్స్ పంచారు. అనంతరం క్యాంప్‌కు హాజరు కాని పిల్లల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి. సదానందం, పీడీ అంబాజీ, శ్రీనివాస్, రమణ రావు, భోజన్న, టీచర్స్ నాగభూషణ్ పాల్గొన్నారు.


విద్యార్థులతో పాటు కింద కూర్చొని వారితో మాట్లాడుతున్న డీఈవో


నర్సాపూర్(జి)విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

నర్సాపూర్‌లో..

నర్సాపూర్(జి), మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ నర్సాపూర్‌లో నడుస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని డీఈవో పి. రామారావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ... పిల్లలందరూ సమ్మర్ క్యాంప్‌లను వినియోగించుకోవాలని, ప్రతి రోజు క్యాంప్‌కు రావాలని సూచించారు. వేసవి సందర్భంగా వారికి తగు జాగ్రత్తలు చెప్పారు. అనంతరం వారికి స్నాక్స్ అందించారు. తర్వాత క్యాంప్‌కు హాజరు కాని పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులతో మాట్లాడి, వారందరూ క్యాంప్‌కు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం,మండల ఎంఐఎస్ శ్రావణ్, పీడీలు శ్రీనివాస్, రమణ రావు, భోజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోకలితో తండ్రిని కొట్టి చంపిన కొడుకు


గన్నారం భూమన్న మృతదేహం

లోకేశ్వరం, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుర గ్రామంలో శనివారం తండ్రిని కొడుకు రోకలితో బాది హత్య చేశాడు. స్థానికులు, కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజుర గ్రామానికి చెందిన గన్నారం భూమన్న(80) పెద్ద కుమారుడు గన్నారం భూమన్న(57) అతని భార్య సంవత్సరం క్రితం పుట్టింటికి వెళ్లడంతో ఇద్దరు కలిసి రాజుర గ్రామంలో నివసిస్తున్నారు. గత మూడు నాలుగు రోజుల నుంచి తన కుమారుడు అన్నం పెట్టడం లేదని, మంచి చెడులు చూసుకోవడం లేదనే విషయంలో గొడవలు జరుగుతున్నాయి. శనివారం మధ్యాహ్నం తండ్రి, కొడుకుల మధ్య గొడవ జరిగింది. రోకలితో తండ్రి తలపై కొడుకు కొట్టి చంపేశాడు. ఈ విషయం మృతుడి కూతురు సుజాతకు ఫోన్ చేసి చెప్పాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సంఘటన స్థలాన్ని అవినాష్‌కుమార్ ఏఎస్పీ భైంసా, జి. మల్లేష్ సీఐ ముథోల్, జి. అశోక్ ఎస్సై లోకేశ్వరం సందర్శించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఒకరి మృతి


గోదావరి మృతదేహం

లోకేశ్వరం, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హవర్గా గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం పై నుంచి పడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... కల్లూర్ గ్రామానికి చెందిన పి.సాయన్న, అతని భార్య పి.గోదావరి(40) ఇద్దరు కలిసి లోకేశ్వరం మండలంలోని పిప్రి గ్రామంలో పెళ్లికి వెళ్లి శనివారం ఉదయం ద్విచక్ర వాహనం పైన తిరిగి కల్లూర్ వెళ్తుండగా ఉదయం హవర్గా గ్రామ శ్మశాన వాటిక దగ్గర గోదావరికి కళ్లు తిరిగి ద్విచక్ర వాహనం పైనుంచి పడిపోయింది. ఆమెను భైంసా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తమ్ముడు దాసశేఖర్ ఫిర్యాదు మేరకు లోకేశ్వరం ఎస్సై అశోక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

నేడు మున్సిపల్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులు ఇవ్వాలి

- నిర్మల్ మున్సిపల్ కమిషనర్

నిర్మల్ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : నేడు (ఆదివారం) మున్సిపల్ ఆఫీస్ నందు రాజీవ్ యువ వికాసం అప్లికేషన్ ఫారాలు సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్ యువ వికాసం పథకం కొరకు ఆన్‌లైన్ అప్లై చేసుకొని మున్సిపల్ ఆఫీస్ నందు అప్లికేషన్ ఫారాలు ఇవ్వని వారు నేడు ఉదయం 9 నుండి సాయంత్రం 5:30 వరకు ఆఫీస్ కౌంటర్ నందు తమ ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా బుక్, పాన్ కార్డు జిరాక్స్ సమర్పించాలని తెలిపారు.